
## రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్, డిసెంబర్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో రాష్ట్రపతి విడిది చేసే సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఏర్పాట్లను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మంగళవారం ఉదయం పరిశీలించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ తో కలిసి రాష్ట్రపతి నిలయం, పరిసర ప్రాంతాల్లో శుభ్రత, శానిటేషన్, ట్రాఫిక్ నియంత్రణ, పౌర సౌకర్యాల ఏర్పాట్లను కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, ఫీల్డ్ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు.



రాష్ట్రపతిభవన్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్



హైదరాబాద్ వార్త

# ఏ ప్రాతిపదికన డివిజన్ల విభజన?



- -జనాభానా, ఓటర్లా, భౌగోళిక స్వరూపమా..
- -ఒక్కోడివిజన్ ఒక్కోలా చేయడం వెనక రాజకీయ కుట్ర
- -జిహెచ్ఎంసి కౌన్సిల్ మీటింగ్‌లో కార్పొరేటర్ల ఆరోపణ
- -విభజన అశాస్త్రీయంగా జరిగిందంటూ మండిపాటు
- -వార్డుల అభివృద్ధికి ప్రణాళికలు ఏంటో చెప్పాలని డిమాండ్
- -రసాభాసగా ముగిసిన జిహెచ్ఎంసి ప్రత్యేక కౌన్సిల్
- -సభ్యులందరి అభిప్రాయాలు తీసుకోకుండానే ముగింపు
- -"డివిజన్ చోరీ " జరిగిందంటూ బిజెపి నిరసన
- -ఎంఐఎం మెప్పు కోసమేనంటూ ఆరోపణ



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** శివారు ప్రాంతాల్లోని 20 మున్సిపాలిటీలు, 7కార్పొరేషన్లను జిహెచ్ఎంసిలో విలీనం చేసిన తర్వాత గతంలో ఉన్న 150 డివిజన్లకు మరో 150కలిపి మొత్తం 300 డివిజన్లు చేసిన విషయం తెలిసిందే..ఈనేపథ్యంలో డీలిమిటేషన్‌పై సభ్యుల అభిప్రాయాలను తీసుకునేందుకు జిహెచ్ఎంసి మంగళవారం ప్రత్యేక కౌన్సిల్ మీటింగ్ నిర్వహించింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఉదయం 10.50గంటలకు ప్రారంభమైంది. దీనికి కమిషనర్ ఆర్.వి కర్ణన్‌తోపాటు, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం కార్పొరేటర్లు, ఎక్స్ అఫీసియో సభ్యులు హాజరయ్యారు. ఈసందర్భంగా డివిజన్ల డీలిమిటేషన్ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సభలో ప్రవేశపెట్టారు. జీహెచ్ఎంసీ వార్డుల సంఖ్యను ప్రభుత్వం 300కు పెంచిందని తెలిపారు. వార్డుల సంఖ్య పెంపుపై సరిహద్దులు, తదితర వివరాలు జీవో 266లో పొందుపర్చామన్నారు. జీహెచ్ఎంసీ వార్డుల పెంపుపై ఇంకా అభ్యంతరాలు వస్తున్నాయని వాటిని పరిగణలోకి తీసుకుంటామన్నారు.జీవో 570 రూల్4 ప్రకారం సహజ సరిహద్దుల ప్రకారం పునర్విభజన చేస్తున్నామని తెలిపారు. నాలాలు, మేజర్ రోడ్లు, ల్యాండ్‌మార్కులు, రైల్వేలైన్ల మేరకు పునర్విభజన ఉంటుందన్నారు. పాత రికార్డుల్లోని సర్వే నంబర్ల ప్రకారం వార్డుల పునర్విభజన చేస్తున్నామని ఏ వార్డును కూడా అసెంబ్లీ పరిధి నుంచి మార్చట్లేదని జీహెచ్ఎంసీ కమిషనర్ సమావేశంలో పేర్కొన్నారు.

**ఏ ప్రాతిపదిక చేశారో చెప్పాలి..**

డివిజన్ల విభజనపై బిఆర్ఎస్, కాంగ్రెస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాట్లాడారు. డివిజన్ల విభజన ఏ ప్రాతిపదికన చేశారో తెలియట్లేదని అసహనం వ్యక్తం చేశారు.బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఏపార్టీని సంప్రదించకుండా విభజన జరిగిందని..ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ల్యాప్‌టాప్‌లల్లో, గూగుల్ మ్యాప్‌ల ఆధారంగా హద్దులు నిర్ణయించారని మండిపడ్డారు. జిహెచ్ఎంసికి కూడా చట్టాలని ఉన్నాయని వాటిని అతిక్రమించి హడావిడిగా చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న జిహెచ్ఎంసికే సరిపడ సిబ్బంది లేనప్పుడు 300డివిజన్లలో పాలన ఎలా చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఈసందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్‌కు తెలియకుండానే విభజన జరిగిందని తలసాని అనగా ..మేయర్ స్పందిస్తూ అవునని సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం హడావిడిగా చేయకుండా బస్తీ,కాలనీల అసోసియేషన్లతో సమావేశం నిర్వహించడంతోపాటు,ఫిజికల్‌గా సర్వే, కౌన్సిల్‌లో ఓటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ మేయర్, కమిషనర్ల ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల సభ్యుల అభిప్రాయాలను తీసుకున్నాకే డిలిమిటేషన్‌పై ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ వార్డుల పునర్విభజనపై తనకు ఎలాంటి సమాచారం లేదని అసహనం వ్యక్తం చేశారు. గతంలోనూ ఇలాంటి పరిణామాలు జరిగాయన్నారు. శివారు మున్సిపాలిటీల విలీనాన్ని అసెంబ్లీ పరిధిలోనే వార్డుల పునర్విభజనను స్వాగతిస్తున్నామని జీహెచ్ఎంసీ పరిధి 600 చ.కి.మీ. నుంచి 2 వేల చ.కి.మీకు పెరుగుతోందని, ఈ నేపథ్యంలో కార్యాచరణ ప్రణాళిక ఏం చేపట్టారని ప్రశ్నించారు. వార్డుల పునర్విభజనతో పాటు బడ్జెట్ పెంపును పరిగణనలోకి తీసుకున్నారా అని అడిగారు. వార్డుల పునర్విభజనను శాస్త్రీయంగా చేపట్టాలని కోరుతున్నానని వివరించారు. మేయర్, కమిషనర్ ఛాంబర్‌లోనూ కార్పొరేటర్ల అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ నివేదిక ఆధారంగా విలీనం చేశారని దాని ఆధారంగా ఎలా విలీనం చేస్తారని ప్రశ్నించారు. విలీనం గురించి తెలియదని మేయర్ కూడా ఒప్పుకున్నారని ప్రజాప్రతినిధులు, పార్టీలతో చర్చించకుండా నిర్ణయం ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ జవహర్‌నగర్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తున్నారని 150 డివిజన్ల చెత్త మొత్తం జవహర్ నగర్‌లోనే వేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో వార్డుల్లో మురుగు నీరు శుద్ధి చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీసం పట్టించుకోవట్లేదు. అనారోగ్యం పాలై జవహర్‌నగర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జవహర్‌నగర్‌కు ప్రత్యేకబడ్జెట్ ఇవ్వాలనిమల్లారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే వివేకానందగౌడ్ మాట్లాడుతూ డిలిమిటేషన్ నిర్ణయం శివారుప్రాంత ప్రజలకు శాపంగా మారిందని.. దీనిపై ఎక్స్‌పర్ట్‌కమిటీ వేసి స్టడీ టూర్ నిర్వహించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు.

**గతంలో అధికార పక్షానికైనా తెలిసేది...**

గతంలో వార్డుల పునర్విభజనపై అధికార పక్షానికైనా తెలిసేదని బీజేపీ ఫ్లోర్‌లీడర్ శంకర్ యాదవ్ అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో మూడుసార్లు పునర్విభజన జరిగిందని పునర్విభజనపై గతంలో అన్ని పార్టీలతో కమిటీలో చర్చలు జరిగేవని తెలిపారు. కనీసం కాంగ్రెస్, ఎం ఐఎంకైనా పునర్విభజనపై తెలిసి ఉండాలన్నారు. కనీసం మేయర్‌కు కూడా పునర్విభజన గురించి తెలియకపోవడం శోచనీయమని అసహనం వ్యక్తంచేశారు. బిజెపి కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ బంజారాహిల్స్‌లో కంటే ఎల్బీనగర్‌లో ఎక్కువ టాక్స్‌లు కడుతున్నామని కానీ అభివృద్ధి, నిధుల కేటాయింపుల్లో వెనకబాటుకు గురవుతున్నామన్నారు.

కాంగ్రెస్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ డివిజన్ల విభజనపై తమకు తెలియదని ఏప్రాతిపదికన చేశారో తకు కూడా చెప్పలేదన్నారు. బిజెపి మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ మాట్లాడుతూ మంగళ్‌హాట్ డివిజన్‌లోని కొంతప్రాంతాన్ని దత్తాత్రేయ నగర్‌లో పెట్టారని హిందువుల ఓట్లు చీల్చడానికే ఈచర్యకు పాల్పడ్డారన్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే మంగళ్‌హాట్ జిగ్‌జాగ్‌గా ఉందని చెప్పున్నారని పక్కనే ఉన్న చార్మినార్ జిగ్‌జాగ్‌గా కనిపించడంలేదా అని ప్రశ్నించారు. మౌలాలి బిజెపి కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ చారిత్రాత్మక నిర్ణయం చారిత్రక తప్పిదం కావద్దని.. మౌలాలిని ఎందుకు విభజించలేదో చెప్పాలన్నారు.

**గందరగోళం నడుమ సభ వాయిదా..**

డిలిమిటేషన్‌పై చర్చలు జరుగుతున్న క్రమంలో సభలో ఒక్కసారిగా గందరగోళం చెలరేగింది. దారుస్సలంలో వార్డుల విభజన చేశారంటూ బీజేపీ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో ఎంఐఎం– బీజేపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గెజిటెడ్ పేపర్లను చింపి కౌన్సిల్లో విసురుతూ, మేయర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు బీజేపీ కార్పొరేటర్లు. దీంతో బీజేపీ కార్పొరేటర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ..ఆతర్వాత గందరగోళం నడుమ పునర్విజనపై కార్పొరేటర్లు నుంచి వచ్చిన అభిప్రాయాలను, అభ్యంతరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పి సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

**"డివిజన్ చోరీ " అంటూ బిజెపి ఆందోళన..**

డివిజన్ల చోరీ జరిగిందంటూ పునర్విభజనకు వ్యతిరేకంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు బిజెపి కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకొని నిరసన చేపట్టారు. తమను సంప్రదించకుండా డివిజన్ల పెంచుతున్నారని ఆందోళన చేశారు. ఎంఐఎంకు అనుకూలంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పునర్విభజన చేపట్టాయని వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఆమూడు పార్టీలు ఏకమయ్యాయని విమర్శించారు.



జిహెచ్ఎంసి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బిజెపి కార్పొరేటర్లు

## తల్లిదండ్రుల్ని రోడ్డున వదిలేస్తే కఠిన చర్యలు : సిపి సజ్జనార్

**హైదరాబాద్ డిసెంబరు 16 ప్రభాతవార్త ;**



వృద్ధాప్యంలో ఉన్న పేరెంట్స్‌ను హింసించినా.. వారిని పట్టించుకోకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు.తల్లిదండ్రుల బాగోగులు చూడటం బిడ్డల కనీస ధర్మమని చెప్పారు. ఈ విషయంలో ఎలాంటి సాకులు, సమర్ధనలకు ఆస్కారం లేదని సీపీ స్పష్టం చేశారు. అనారోగ్య సమస్యల ఉన్న పేరెంట్స్‌ను రోడ్డును పడేయడం దారుమన్నారు. కన్నవాళ్ల బాగోగులు చూడడం పిల్లల కనీస ధర్మం అని అన్నారు. ఇటీవల తల్లిదండ్రులను పట్టించుకోకుండా.. వారిని వదిలేయడం వంటి సంఘటనలను ఉద్దేశించిన సజ్జనార్ ట్వీట్ చేశారు. "నిత్యం ఎంతోమంది బాధితులు తమ కష్టనష్టాలను చెప్పుకోవడానికి నా దగ్గరకు వస్తుంటారు. గతంలో టీజీఎస్ఆర్టీసీ, సైబరాబాద్ సహా వివిధ జిల్లాల్లో పనిచేసిన అనుభవంలోనూ.. ప్రస్తుతం హైద రాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా నన్ను తీవ్రంగా కలచివేస్తున్న వాస్తవం ఒక్కటే. వృద్ధాప్యంలో, అనారోగ్యంతో ఉన్న తల్లిదండ్రులను సొంత బిడ్డలే అనాథలుగా వదిలేయడం అనేకసార్లు చూశా. ఇది ఎంతమాత్రం ఆమో దయోగ్యం కాదు. తల్లిదండ్రుల బాగోగులు చూడటం బిడ్డల కనీస ధర్మం. ఇది చర్చలకు తావులేని వారి హక్కు. ఈ విషయంలో ఎలాంటి సాకులకు, సమర్ధ నలకు ఆస్కారం లేదు. ఒక్క విషయం గుర్తుంచుకోండి.. ఈ రోజు మీ తల్లిదండ్రుల పట్ల మీరు ప్రవర్తించే తీరే.. రేపు మీ పిల్లలకు పాఠం అవుతుంది. నేడు మీరు ఏది విత్తుతారో.. వృద్ధాప్యంలో అదే కోసుకుంటారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం వహించినా, హింసించినా ఉపేక్షించేది లేదు. కన్నవారిని రోడ్డున వదిలేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు. దిక్కుతోచని స్థితిలో, తమ గోడు ఎవరూ వినడంలేదని కుమిలిపోతున్న ప్రతి వృద్ధుడికి, ప్రతి తల్లికి పోలీసుశాఖ అండగా ఉంటుంది. మీరు ఒంటరి వారు కాదు. మీ ఆత్మగౌరవం, భద్రత, శ్రేయస్సు మాకు అత్యంత ముఖ్యం. బాధితులు నిర్భయంగా నేరుగా సంప్రదించవచ్చు" అని ట్వీట్ చేశారు

## కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

**చిక్కడపల్లి డిసెంబర్ 16 ప్రభాతవార్త :** తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ, రమ, కె. ఈశ్వర్రావు, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, కూరపాటి రమేష్, పి. శ్రీకాంత్, పి. సుధాకర్, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, ఐఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్కుమార్ యాదవ్, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్. పద్మ, ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, నాయకులు శివబాబు, ఏఐయుటియుసి రాష్ట్ర నాయకులు భరత్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు అరిబండి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై. సోమన్నలు పాల్గొన్నారు. షాహి ఎక్స్పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు రూ.16 వేలు వేతనం ఇవ్వాలని, యాజమాన్యం వేధింపులు ఆపాలని, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని, ఒకరోజు సెలవు పెడితే రూ.800/లు కట్ చేసే పద్ధతిని ఆపాలని, బోనస్ 20 శాతానికి పెంచాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో పలు డిమాండ్ లను ఆమోదించారు. అనంతరం జెసిఎల్ సమక్షంలో షాహి ఎక్స్పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యానికి కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులకు మధ్య చర్చలు జరిగాయి. ఆ చర్చలు రేపటికి వాయిదా పడ్డాయి.

## పాతబస్తీలో విస్తరిస్తున్న డ్రగ్స్ విక్రయాలు

- మత్తుకు బానిసలై చిత్తవుతున్న జీవితాలు
- ఫలితమివ్వని అవగాహన సమావేశాలు



పోలీసుల అదుపులో అక్రమంగా మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న నిందుతులు

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** రోజు రోజుకు యువత మత్తుకు చిత్తవుతున్నారు. తెలియని ఆనందం కోసం డ్రగ్స్ వలలో చిక్కుకుంటున్నారు. వాటికి బానిసలై బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. కుటుంబాలకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్తుపై ప్రత్యక్ష యుద్ధం చేస్తున్నా డ్రగ్స్ మూలాలు సమూలంగా నాశనం కావడం లేదు. పైగా చెట్టుకు పిల్ల మొక్కలు వచ్చినట్లు పలు రూపాలలో డ్రగ్స్ సమాజంలో విస్తరిస్తోంది. వైట్నర్, గంజాయి, చాక్లెట్లు, మాదక ద్రవ్యాలు, మత్తు ఇంజక్షన్లు ఇలా రకరాల రూపంలో విచ్చల విడిగా దొరుకుతున్నాయి. డ్రగ్స్ పెడ్లర్లు (వ్యాపారులు) పోలీసుల, నార్కోటెక్స్ అధికారుల కళ్లుగప్పి పక్క రాష్ట్రాల నుంచి ద్విచక్రవాహనాలు, బస్సులు, రైళ్లు, లారీలు, వ్యాన్లు, కార్లలో రహస్యంగా తరలిస్తున్నారు. హవాల సొమ్ములా ఎక్కడికి, ఎవరి వద్దకు చేర్చాలో వారికి చేర్చుతున్నారు. కిరాణా దుకాణాలు, కిల్లీకొట్లు, ఇళ్లలో వీటి విక్రయాలు సాగిస్తున్నారు. కొంతమంది ఏజెంట్ల సహాయంతో కమీషన్‌పై అవసరమైన వారికి సరఫరా చేస్తున్నారు. ఇలా పాతబస్తీలో మత్తు దందా సాగిస్తున్నారు. కొంతమంది ఏజెంట్ల సహాయాంతో కమీషన్‌పై అవసరమైన వారికి చేరుస్తున్నారు. ఇలా పాతబస్తీలో మత్తు దందా చాపకింద నీరులా పాకుతుంది. వాటికి అలవాటు పడిన వారు మాదక ద్రవ్యాల కొనుగోలు కోసం కుటుంబ సభ్యులతో తెగబడుతున్నారు. ప్రధానంగా గృహ నిర్మాణ కూలీలు, నిరుద్యోగ యువత, ఆటో డ్రైవర్లు, చిత్తు కాగితాలు ఏరుకునే మైనర్లు, మహిళలు నిత్యం గంజాయి మత్తులో తేలిపోతున్నారు. ఇటీవల పాతబస్తీలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. చాంద్రాయణగుట్ట పరిధిలో జాప్టో వద్ద నాలా పక్కన ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ నెల మూడున చాంద్రాయణగుట్ట వంతెన కింద ఇద్దరు వ్యక్తులు ఆపరేషన్ సమయంలో ఇచ్చే మత్తు ఇంజెక్షన్ అట్రినియంను తీసుకొని కూర్చున్న ఆటోలోనే ప్రాణాలు వదిలారు. ఛత్రినాకా పోలీసు స్టేషన్ పరిధిలో ఈ నెల 13.న ఓ వ్యక్తి మత్తులో మద్యం తీసుకొని ఓ బారులో కూర్చున్న చోటే ప్రాణాలు వదిలాడు. ఫలక్‌నూమా పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మహిళ ఒక ఏజెంట్ సహాయంతో గంజాయి విక్రయించి పోలీసులకు పట్టుబడింది. ఇలా దొరికితే దొంగ అన్న తరహాలో గంజాయి విక్రయాలు కొనసాగుతున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలన్న దురాశతో మెడికల్ దుకాణాలు, సేల్స్ ఏజెంట్లు కొందరు ఎలాంటి డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయించి పోలీసులకు దొరికిపోతున్నారు. వీరిపై డ్రగ్స్ కంట్రోల్ అధికారులు నియంత్రణ కొరవడటమే అక్రమ వ్యాపారాలకు దారి తీస్తుంది. మరోవైపు స్థానిక పోలీసులు, రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ప్రత్యేక అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు, యువతకు మాదక ద్రవ్యాల పై ప్లకార్డులు, వాల్ పోస్టర్లు, నాటికల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అయినా ప్రయోజనం అంతంత మాత్రంగానే ఉంటుంది.

## 'మెట్రో' టేక్ ఓవర్ మార్చికల్లా పూర్తి చేయాలి

### -ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు



'మెట్రో' టేక్ ఓవర్ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు,చిత్రంలో మెట్రో ఎండీ షెర్ఫరాజ్ అహ్మద్,ప్రభుత్వ సలహాదారులు ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్ అండ్ టీ మెట్రో ఎండి కేవీబీరెడ్డి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 16 ప్రభాతవార్త** హైదరాబాద్ మెట్రో రైల్ టేక్ ఓవర్ ప్రక్రియను ఈ ఆర్థిక సంవత్సరాంతానికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యదర్శుల స్థాయి కమిటీ, ఎల్ అండ్ టీ అధికారులతో జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన మెట్రో రైల్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ తాజా పరిస్థితిని సమీక్షించారు. ఇరు పక్షాలు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బదలాయింపు సజావుగా వేగవంతంగా పూర్తి కావాలని సూచించారు. ఈ ప్రక్రియను ఇదివరకటి ఒప్పందాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చేపట్టాలని అయన స్పష్టం చేసారు. రాబోయే వంద రోజుల్లో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. టేక్ ఓవర్ ప్రక్రియ పై ఏర్పాటు చేసిన ట్రాన్సాక్షన్ అడ్వైజర్ ఐడీబీఐ ఈ మేరకు తన నివేదికను త్వరిత గతిన పూర్తి చేసి బదలాయింపు ప్రక్రియను పూర్తి చేయాలనీ ఇందులో ఎల్ అండ్ టీ కూడా పూర్తి సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఆ తర్వాత ఆపరేషనల్, మెయింటనెన్స్‌కు సంబంధించి ప్రతిపాదనలను రూపొందించాల్సిందిగా హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ షెర్ఫరాజ్ అహ్మద్‌కు సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్) ఎన్వీఎస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ ఎండి కేవీబీరెడ్డి, ఐడీబీఐ అధికారులు, హెచ్ఎంఆర్ఎల్ ఛీఫ్ ఎలెక్ట్రికల్ ఇంజనీర్ డీవీఎస్ రాజు అధికారులు పాల్గొన్నారు.

## పివి ఎక్స్‌ప్రెస్ హైవేపై యాక్సిడెంట్

### -ప్రయాణికులకు స్వల్ప గాయాలు



**అత్తాపూర్ డిసెంబరు16, ప్రభాతవార్త:** పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవేపై పిల్లర్ నంబర్ 272 వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మెహదీపట్నం నుండి ఆరామ్‌ఘర్ వైపు వేగంగా వచ్చిన ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.ఈ ఘటనతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. స్వల్పంగా గాయపడిన కారులోని ప్రయాణికులను ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

### చైనా మాంజా అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేస్తాం



చైనా మాంజాను అమ్మకాలు చేస్తున్న ఇద్దరు అరెస్ట్ చేసిన పోలీసులు

**గోషామహల్,డిసెంబర్ 16ప్రభాతవార్త:** నిషేదించిన చైనా మాంజను విక్రయిస్తున్న ఇద్దరు యువకులనుమంగళ్‌హాట్ పోలీసులు అరెస్ట్ చేసి వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గోషామహల్‌ఏసిపి సుదర్శన్ కథనం ప్రకారం.. దూల్‌పేట ప్రాంతానికి చెందిన రణవీర్‌సింగ్(20), వివేక్‌సింగ్(26)లుగాలిపటాలను అమ్మకాలు చేస్తుంటారు. నిషేందించిన చైనా మాంజాను అక్రమంగా అమ్మకాలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్ పోలీసులు దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి లక్ష 32వేల విలువ చేసే 132 డబ్బాలను బాబిన్ల మోనాఫిల్ గోల్డ్‌నిషేదిత సింథటిక్ నైలాన్‌కొటెడ్ చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు.వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టంలోని 223, 125 బిఎన్ఎస్, సెక్షన్5,15 కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.కేసును మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్ దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు : డైరెక్టర్ శివాజీ



విద్యుత్ శాఖ సిబ్బందికి అల్యూమినియం టెలిస్కోపిక్ లాడర్లు, టూల్ కిట్స్ ను అందజేస్తున్న విద్యుత్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ, చిత్రంలో డిఇ విష్ణువర్ధన్ రెడ్డి, ఏడిఈ శోభన్ బాబు తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 16, ప్రభాతవార్త:**
విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని విద్యుత్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ పేర్కొన్నారు. చంచల్ గూడ విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి, ఎడిఇ శోభన్ బాబులతో కలిసి ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ సిబ్బందికి అల్యూమినియం టెలిస్కోపిక్ లాడర్లు, టూల్ కిట్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉండే సిబ్బంది రక్షణ కోసం పలు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యుత్ స్తంభాలను సులభంగా ఎక్కడానికి అల్యూమినియం టెలిస్కోపిక్ లాడర్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వినియోగదారుల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించడానికి టూల్ కిట్స్ దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఇలు సంతోష్ బాబు, ప్రసాద్, తాజుద్దీన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ నగర్ అయ్యప్ప ఆలయంలో లక్షదీపాల మహోత్సవం



**నేరెడ్‌మెట్,జవహర్‌నగర్, డిసెంబర్16,ప్రభాతవార్త :**
బాలాజీ నగర్‌లోని శ్రీ అయ్యప్ప దేవాలయంలో లక్షదీపాల మహోత్సవం అయ్యప్ప స్వామి ఆశీస్సులతో అంగరంగ వైభవంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామి హరివరాసనం అనంతరం స్వాములకు అల్పాహారం, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయం అంతటా పండుగ వాతావరణం నెలకొంది. ఈ మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దేవేందర్ రెడ్డి, కిరణ్, సుధాకర్ గౌడ్, కార్యదర్శి జమాల్పూర్ నవీన్, కోట శ్రీనాథ్, రెడ్డిశెట్టి మహేష్ గుప్త, రెడ్డిశెట్టి పాండురంగం, ఖజానాదారు కోట్ల చెన్నా రెడ్డి, శ్రీమన్నారాయణ, సింగారం సంతోష్ గౌడ్, గుండ బిక్షపతి, పూజారి రాజు సిద్ధేశ్వర గురుస్వామి, శ్రీశైలం గురుస్వామి, సింగన్న బాలరాజు, ఉడుత సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



స్మశాన వాటికలలో పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** రూ. 54 లక్షల రూపాయల వ్యయంతో నాచారం బుడగ జంగాల స్మశాన వాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్మశానవాటికలో నిర్మించిన స్థానాల గదులను, బర్నింగ్ ప్లాట్ఫాం, వెయిటింగ్ హాల్ ను పర్యవేక్షించారు. స్మశానవాటికలో చిందరవందలుగా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు ఉన్నాయని, వాటిని తొలగించి స్మశాన వాటికలో పాములు రాకుండా చేయాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. స్మశాన వాటికలో ఏర్పాటుచేసిన కరెంటు స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. స్మశాన వాటిక అభివృద్ధిపై బుడగ జంగాల పెద్దలు సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం నియోజకవర్గంలోనే బుడగ జంగాల కంటూ ప్రత్యేక స్మశాన వాటిక ఉండడం అది కార్పొరేటర్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి చెందడం చాలా సంతోషమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి ఈ బాలకృష్ణ, ఏఈ వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, లడ్డు, శివ, నరసింహ, అంజయ్య, కృష్ణయ్య, రాము, శంకర్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విలీన ప్రక్రియ ముగిసే లోగా బడంగ్‌పేట్ జోన్ ఏర్పాటు చేయాలి

### రాష్ట్ర బిజెపి నేత కొలన్ శంకర్‌రెడ్డి



చార్మినార్ జోన్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రాష్ట్ర బిజెపి నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:**
కొత్తగా ఏర్పాటు చేస్తున్న బృహత్త హైదరాబాద్ మహానగరం /జిహెచ్ఎంసిలో కలిపిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను తాత్కాలికంగా ఎల్‌బినగర్ జోన్‌లో విలీనం చేసి విలీన ప్రక్రియ ముగిసే లోగా ప్రత్యేకంగా బడంగ్‌పేట్ జోన్‌గా ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి క్యావర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన చార్మినార్ జోన్ కార్యాలయంలో జోనల్ కమీషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 కంటే ముందున్న పాత మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలోనే ప్రస్తుతం ఉన్న మహేశ్వరం, ఇబ్రహీపట్నం నియోజకవర్గాల్లో పలు ప్రాంతాలు ఉండేవని ఆయన తెలిపారు. ఈ మేరకు విలీనం చేసిన ఆయా నియోజకవర్గాల్లోని డివిజన్లను వెంటనే ఎల్‌బినగర్ జోన్‌లో తాత్కాలికంగా కలపాలని ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత బడంగ్‌పేట్ పేరిట ప్రత్యేక జోన్‌ను ఏర్పాటు చేసి జిహెచ్ఎంసి పాలన సాగించాలని శంకర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కిసాన్‌మోర్చా నాయకుడు రామిడి శేఖర్‌రెడ్డి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు రామిడి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అండాల్ నిలయంలో ఘనంగా ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు : నిర్వాహకులు లక్ష్మీదేవి



ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పూలతో సుందరంగా అలంకరించిన అండర్ నిలయం దృశ్యం

**మలక్ పేట,డిసెంబర్ 16, ప్రభాతవార్త:**
ముసారాంబాగ్ లో ని శ్రీ అండళ్ నిలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు లక్ష్మీదేవి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ సాయంత్రం ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా సాయంత్రం మొదటి ప్రవచనం ప్రారంభమవుతుందని, ప్రతిరోజు సాయంత్రం ప్రవచన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. డిసెంబర్ 30వ తేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనం, జనవరి 2వ తేదీ శుక్రవారం ఉందు మదగళిత్త పాశురం పై ప్రవచనము, సాయంత్రం సౌభాగ్యవతులైన శ్రీ అండాళ్ నిలయం భక్తులకు శ్రీ ఆండాళ్ నిలయం నిర్వాహకులతో పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలం వితరణ కార్యక్రమం, అదేవిధంగా తిరుప్పావై ఒక ప్రత్యేక నేపద్య కచేరి, 5వ తేదీ సోమవారం ఖిఏట్రాకలంగల్‌ఖి పాశురం, మాతృశ్రీ రిందా దేవి తిరునక్షత్రం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం, రాత్రి 7:30 గంటలకు రిందా శరణ్య నాట్యమండలి శ్రీమతి యశోద వారి బృందం నాట్య ప్రదర్శన, 8వ తేదీ గురువారం అండాళ్ నిలయంలో దీపోత్సవం, స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనం, మంగళ శాసనం, 11వ తేదీ ఆదివారం ఉదయం అండాళ్ తల్లికి నీరాటోత్సవం, అనంతరం 108 గంగాలములతో అక్కార వడిశల్ విశేష ప్రసాద నివేదన వితరణ కార్యక్రమం, 14వ తేదీ బుధవారం భోగి పండుగ, గోదా కళ్యాణం, సాయంత్రం తిరుప్పావై ఫల శృతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## ఉప్పల్ కస్టోడియన్ స్థలాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు



ఉప్పల్ చౌరస్తాలోని కస్టోడియన్ స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారి విజయ్‌కుమార్, ముజఫర్ తదితరులు

**హైదరాబాద్ డిసెంబరు 16 ప్రభాతవార్త :** ఉప్పల్ చౌరస్తాలో ఉన్న సుమారు 4 ఎకరాల కస్టోడియన్ స్థలాన్ని మంగళవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. రామంతాపూర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ గువ్వల జలంధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం హైడ్రా తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ ముజఫర్, ఇతర సిబ్బంది కస్టోడియన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఉప్పల్ కస్టోడియన్ స్థలం గురించి ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. సుమారు 4 ఎకరాలు ఉన్న ఈ స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలతో కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. స్థల యజమానికి సదరు స్థలానికి సంబంధించిన పత్రాలు తీసుకుని రావాలని కోరినట్లు తెలిపారు. వారికి నోటీసులు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు హైడ్రా కృషి చేస్తుందని తెలిపారు. కాగా గత ప్రభుత్వ హయాంలో ఉప్పల్ చౌరస్తాలోని కస్టోడియన్ స్థలాన్ని కొందరు బడా నేతలు తప్పుడు పత్రాలతో అనుమతులు తీసుకున్నట్లు ఫిర్యాదులు ఉన్నారు. అధికారులు దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో జిహెచ్ఎంసి కొత్త జోన్ ఏర్పాటు

### నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కెఎల్ఆర్ వెల్లడి



రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుతో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:**
కొత్త డివిజన్ల ఏర్పాటు, పాత డివిజన్ల పునర్విభజన జరిగిన నేపథ్యంలో మొత్తం 300 డివిజన్లతో విస్తరించబడ్డ బృహత్తర హైదరాబాద్ మహానగరం/జిహెచ్ఎంసిలో నూతనంగా మహేశ్వరం జోన్ ఏర్పాటు కానున్నదని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూత్రప్రాయంగా వెల్లడించారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు హామీనిచ్చారని ఆయన తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన డివిజన్లు, పునర్విభజన జరిగిన పాత డివిజన్లు కలిపి మొత్తం 15 అయ్యాయనీ వీటితో పాటు పక్కనున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కిందకు వచ్చే ఆదిభట్ల, తుర్కయాంజాల్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజన్లతో కలిపి ప్రత్యేకంగా జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయం ఏర్పాటుకానుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు తాను చేసిన ప్రతిపాదనలను ఇంఛార్జి మంత్రుల దృష్టికి తీసుకెళ్ళగా వారు సానుకూలంగా స్పందించారని కెఎల్ఆర్ తెలిపారు. జిహెచ్ఎంసి అధికారులు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. జిహెచ్ఎంసి విస్తరణ సందర్భంగా ప్రస్తుతం ఉన్న పాత చార్మినార్, ఎల్‌బినగర్ జోన్లలో డివిజన్లను విలీనం చేయడం తాత్కాలికమేనని ఆయన స్పష్టం చేశారు. త్వరలో మహేశ్వరం నియోజకవర్గంలోని డివిజన్లతో పాటు ఇబ్రహీంపట్నం కిందకు వచ్చే డివిజన్లను కలిపి మహేశ్వరం నియోజకవర్గంలో ప్రత్యేక జోనల్ కార్యాలయం ఏర్పాటు అవుతుందని ఆయన వెల్లడించారు. ఓటర్ల సంఖ్య ప్రాతిపదికను డివిజన్ల మార్పులు చేర్పులు జరిగిన తర్వాత ప్రత్యేక జోన్ ఏర్పాటు కావడం ఖాయమని కెఎల్ఆర్ స్పష్టం చేశారు.


## అయ్యప్పస్వాములకు సత్కారం



రామంతాపూర్‌లో అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ తదితరులు

**హైదరాబాద్ డిసెంబరు 16 ప్రభాతవార్త :** రామంతాపూర్ మార్కండేయస్వామి ఆలయంలో కాంతారావు గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ పాల్గొని అయ్యప్పస్వాములకు చేతి రుమాలు అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహ్మద్ రఫీక్ మాట్లాడుతూ ఎంతో నియమ నిష్టతో అయ్యప్ప దీక్ష చేస్తున్న అయ్యప్పస్వాములకు తగు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్పస్వాములకు ప్రభుత్వం నుంచి కూడా తగు చేయూత అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది అయ్యప్పస్వాములకు చేతి రుమాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు మోహన్ స్వామి, వాసు స్వామి, పోలినేడు స్వామి, బాలరాజు, గంగపుత్ర భాస్కర్, పైల ఆదినారాయణ గౌడ్, గాయత్రి, సందీప్ మొహమ్మద్ నయీమ్, నూరి, స్వామి, మధు పాల్గొన్నారు.

## బీరప్పగడ్డ డివిజన్‌ను స్వరూప్‌నగర్‌గా మార్చాలని వినతి



ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ సంఘాల సమాఖ్య నేతలు

**హైదరాబాద్ డిసెంబరు 16 ప్రభాతవార్త :**
జిహెచ్ఎంసి పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన బీరప్పగడ్డ డివిజన్‌ను స్వరూప్‌నగర్ డివిజన్‌గా మార్చాలని పలువురు కాలనీ సంఘం నేతలు డిప్యూటీ కమిషనర్ రాజును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ స్వరూప్‌నగర్, గణేష్‌నగర్, కావేరినగర్, పద్మావతికాలనీ, వెంకటేశ్వరకాలనీ, సెవెన్ హిల్స్ తదితర ప్రాంతాలకు చెందిన కాలనీ సంఘం నేతలు కమిషనర్‌ను కలిసి కొత్త డివిజన్ సమస్యలను విన్నవించారు. బీరప్పగడ్డ ప్రాంతం లేకుండానే డివిజన్‌ను ఏర్పాటు చేశారని, కొత్త డివిజన్‌కు స్వరూప్‌నగర్‌గా మార్చాలని వారు విన్నవించారు. దీనిపై ఉన్నతాధికారులకు రాసి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వరూప్‌నగర్ కాలనీ నేత కృష్ణమాచారి, గణేష్‌నగర్ కాలనీ సత్యపాల్‌రెడ్డి, కావేరినగర్ సుధాకర్‌రెడ్డి, పద్మావతికాలనీ నవీన్, వెంకటేశ్వరకాలనీ బిక్షపతి, సీనియర్ నేతలు అంజిరెడ్డి, కొంద్రు హనుమంతు, లక్ష్మణచారి, మోహన్, మోహన్‌రెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కాంగ్రెస్ నేతల బేటి



తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత వెంకటేశ్వరరెడ్డి తదితరులు

**హైదరాబాద్ డిసెంబరు 16 ప్రభాతవార్త :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేనా రెడ్డితో మంగళవారం హబ్సిగూడకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు బేటి అయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జనంపల్లి వెంకటేశ్వర రెడ్డితోపాటు కొండల్ రెడ్డి గారు, కిషన్ నాయక్ తదితరులు కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## వజ్రేష్ యాదవ్‌ను కలిసిన కృష్ణ గౌడ్



మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆశీర్వాదం తీసుకున్న బొడిగె కృష్ణ గౌడ్, పర్వతాపూర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు

**మేడిపల్లి, డిసెంబర్ 16,ప్రభాతవార్త :**
పీర్జాదిగూడ సర్కిల్ మేడిపల్లి పర్వతాపురం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొడిగె కృష్ణ గౌడ్ మేడ్చల్ డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం పర్వతాపూర్‌లోని కార్యాలయంలో బీఎస్కెజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో మాజీ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు పాల్గొని బోడిగే కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ వేడుకలలో బీంరెడ్డి నవీన్ రెడ్డి. అనంత రెడ్డి, సుభాష్ నాయక్, సీనియర్ నాయకులు పప్పుల అంజి రెడ్డి. యాసరం మహేష్, బండారి రవీందర్, కో ఆప్షన్ సభ్యుడు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు. గ్రామ పెద్దలు పుర ప్రముఖులు కాలనీ అధ్యక్ష కార్యదర్శులు, కాలనీవాసులు, బిఎస్ కేజీ యువసేన తదితరులు పాల్గొని బొడిగె కృష్ణ గౌడ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దిల్ సుఖ్ నగర్ డిపో పరిధిలో 55 కాలనీలకు ఆర్టిసి కొత్త సర్వీసులు

**మలక్ పేట, డిసెంబర్ 16, ప్రభాతవార్త:**
దిల్ సుఖ్ నగర్ డిపో పరిధిలో 55 కాలనీల నుండి బస్సు సర్వీసులు ఈనెల 16వ తేదీ మంగళవారం నుండి ప్రారంభం అవుతున్నాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఈ బస్సు సర్వీసు ఎల్ బి నగర్ నుండి బయలుదేరి దుర్గా మందిర్ మీదుగా సరూర్ నగర్ పోస్ట్ ఆఫీస్, సంకేశ్వర్ బజార్, సరస్వతీ నగర్, సైదాబాద్ కాలనీ, జైలు, డబీర్ పుర, పురాణ హవేలీ, దారు షా ఫ, అఫ్జల్ గంజ్ మరియు హైకోర్టు వరకు రాకపోకలు సాగించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మరియొక సర్వీసు ఎల్ బి నగర్ నుండి బైరాములగూడ, కర్మాన్ ఘాట్, తపోవన్ కాలనీ నుండి సరూర్ నగర్ పోస్ట్ ఆఫీస్ మీదుగా హైకోర్టు వరకు వెళ్ళునని పేర్కొన్నారు.

## ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు వద్దు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**హైదరాబాద్ డిసెంబరు 16 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బోడుప్పల్‌కు తరలించే ప్రతిపాధనలను ఉపసంహరించుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించే ప్రతిపాధనలు ఉపసంహించుకోవాలని వినతి పత్రం సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం స్థానికంగా ఉండాలని, ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని విన్నవించారు. గతంలో ఉప్పల్‌లో ప్రభుత్వం స్థలం కేటాయించిందని, ఇక్కడే కొత్త భవనం నిర్మించాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వివరించారు. కాప్రా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కొత్త భవనం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు సాయిజెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్ బస్తీ దవాఖానా డ్రైనేజీ సమస్య పరిష్కారం



చిలుకానగర్ బస్తీ దవాఖానా వద్ద డ్రైనేజీ సమస్య పరిశీలిస్తున్న జలమండలి జిఎం సంతోష్‌కుమార్, బిఆర్ఎస్ నేతలు కొంపల్లి రవీందర్ తదితరులు

**హైదరాబాద్ డిసెంబరు 16 ప్రభాతవార్త :** చిలుకానగర్ బస్తీ దవాఖానా వద్ద గత కొద్ది రోజులుగా కలుషిత నీటి సరఫరా అవుతున్నట్లు స్థానిక బిఆర్ఎస్ నేతలు పిర్యాదు చేయడంతో మంగళవారం జలమండలి అధికారులు స్పందించి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. చిలుకానగర్ బిఆర్ఎస్ సీనియర్ నేతలు కొంపల్లి రవీందర్, రాజ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు జలమండలి జిఎం సంతోష్ కుమార్, డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ తదితరులతో కలిసి పరిశీలించారు. బస్తీ దవాఖానా వద్ద గత కొద్ది రోజులుగా కలుషిత నీటి సరఫరా అవుతుందని, అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కానికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో ఐదు డివిజన్లు ఏర్పాటు చేయాలి : బిఆర్ఎస్




బడంగ్‌పేట్ సర్కిల్ ఇంఛార్జి డిసి సరస్వతికి వినతి పత్రం ఇస్తున్న బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిలో విలీనం అయిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోనే బడంగ్‌పేట్ పేరిట ప్రత్యేక జోన్‌ను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఆ పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డిలు కోరారు. ఈ మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరుతూ వారు మంగళవారం బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో ఇంఛార్జి డిసి సరస్వతికి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిహెచ్ఎంసిలో విలీనం అయిన బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన డివిజన్లను పాతబస్తీ చార్మినార్ జోన్‌లో కలపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయని తెలిపారు. ఈ మేరకు బడంగ్‌పేట్‌నే ప్రత్యేక జోన్ చేసి అందులో డివిజన్లను కలపాలని వారు కోరారు. పాత బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో మూడు కాకుండా మొత్తం ఐదు డివిజన్లను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇక పోతే మొత్తం ఏడు పాత డివిజన్లు ఉన్న అల్మాస్‌గూడను కలిపి జిహెచ్ఎంసిలో ప్రత్యేకంగా ఒక డివిజన్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక మాజీ సర్పంచ్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి కోరారు.

## ప్రశాంతిహిల్స్ డివిజన్‌ను నందిహిల్స్‌గా మార్చాలని వినతి




వినతి పత్రం ఇస్తున్న నందిహిల్స్ ఫేస్-2 అధ్యక్షుడు ఆనందంగౌడ్

**సరూర్‌నగర్, డిసెంబర్ 16 ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసిలో విలీనం చేసిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొత్తగా ప్రశాంతిహిల్స్ పేరిట ఏర్పాటు చేసిన డివిజన్‌ను నందిహిల్స్‌గా పేరు మార్చాలని నందిహిల్స్ కాలనీ ఫేజ్ 2 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు నందిహిల్స్ కాలనీల ప్రజల తరపున అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిహెచ్ఎంసి మీర్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో అధ్యక్షుడు పులిపల్పుల అనందంగౌడ్ ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిహిల్స్ పేరిట కొత్త డివిజన్ ఏర్పాటు చేయడానికి అనుకూల కారణాలు చాలా ఉన్నాయని తెలిపారు. 120 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన నందిహిల్స్ కేంద్ర బిందువుగా ఉందనీ ప్రధాన బస్టాండ్, ప్రధాన కూడలి, సమావేశాలు నిర్వహించుకోవడానికి కేంద్రం ఉన్నాయనీ అంతే కాకుండా నివాస, వ్యాపార, వాణిజ్యపరంగా నందిహిల్స్ అభివృద్ధి చెందిందని ఆయన వివరించారు. డివిజన్ పేరు పెట్టడానికి నందిహిల్స్‌కు అన్ని అనుకూలతలు ఉన్నందున వెంటనే ప్రశాంతిహిల్స్ పేరు తీసి నందిహిల్స్ డివిజన్‌గా మార్చాలని ఆయన కోరారు.

## కమిషనర్ కర్ణన్‌ను కలిసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, మంద సంజీవరెడ్డి



గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కన్నన్ కు వినతిపత్రం అందజేస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మంద సంజీవరెడ్డి, తదితరులు

**బోడుప్పల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త ;**
గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కన్నన్ ని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తో మాజీ జడ్పీటీసీ ,బిఆర్ఎస్ ప్రెసిడెంట్ మంద సంజీవరెడ్డి కలిసి బోడుప్పల్ ను నాలుగు డివిజన్‌గా చేయాలి వినతి పత్రం అందజేయడం జరిగింది స్పందించిన కమిషనర్ కన్నన్ పరిశీలించి బోడుప్పల్ ప్రజలకు న్యాయం చేస్తాం అని చెప్పడం జరిగింది . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ మీసాల కృష్ణ, నాయకులు శ్రీహరి గౌడ్ ,ఉప్పరి విజయ్ పాల్గొన్నారు.